# బాట మారితే భవిత మనదే...

డాక్టర్ జయప్రకాష్ నారాయణ

**BB 08-May-2006**

ప్రభుత్వ పదవుల్లో కొనసాగడాన్ని ఓ వ్యాపారంగా, వ్యక్తిగత ఆస్తిగా భావించే నాయకమ్మన్యులు కొందరు. అధికారంలో ఉన్నవారు ప్రజాసంక్షేమాన్ని పక్కనపెట్టయినా సరే తమకు మేలు చేయాలని భావించే రాబంధువులు మరికొందరు. ప్రజాస్వామ్య పునాదుల్ని కదిలించే ఈ రకమైన ధోరణులకు అడ్డుకట్ట పడేదెన్నడు?

మహాజన్ హఠాన్మరణం మానవ జీవితంలోని అస్థిరతను, అనిశ్చితిని మరోసారి జ్ఞప్తికి తెచ్చింది. మరణం ఓ విషాదం. జీవితంలో అత్యుత్తమ దశను అనుభవిస్తూ అవాంఛనీయ పరిణామాల కారణంగా కన్నుమూయడం నిజంగా చాలా బాధాకరం. చెప్పుకోదగిన చతురత, నైపుణ్యాలు, సామర్థ్యం ఉన్న ఓ పెద్దస్థాయి రాజకీయనాయకుడి మరణం దేశంలో ఆ మేరకు శూన్యాన్నే సృష్టిస్తుంది. మరోవంక మహాజన్ మరణం మరికొన్ని ప్రశ్నలనూ మన ముందు వదలివెళ్ళింది. సమాజంలో మారుతున్న ధోరణులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మరీ ముఖ్యంగా ఈ సంఘటనకు సంబంధించిన మూడు కీలకమైన అంశాలపై సమాజం దృక్పథం ప్రశ్నార్థకంగా మారింది. కుటుంబం స్వభావం ఎలా మారుతోంది? ఒక సమాజంగా కుటుంబాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి? డబ్బే అన్ని సంబంధాలకూ మూలమైనదిగా మారిపోయిందా? జీవితంలో ఆనందానికి అది మార్గమా లేక అదే జీవిత లక్ష్యమా? ప్రజలకు ప్రాతినిధ్యం వహించడమంటే ఏమిటి? ప్రజల సంతోషాన్ని, సంక్షేమాన్ని పెంచడంకోసం కృషి చేయడమా లేక వారిని కొల్లగొట్టి కుటుంబ ప్రయోజనాలను నెరవేర్చుకోవడమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు తప్పనిసరిగా వెదకాలి... మహాజన్ విషాదం నుంచి పాఠాలు నేర్వాలి.

## *పెరుగుతున్న అంతరాలు*

తొలుత చెప్పుకోవాల్సింది కుటుంబం గురించి. ఒక సమాజంగా మన బలం కుటుంబం. ఓ సామాజిక వ్యవస్థగా మన జీవితాలను, మనం చేసే ప్రతి చర్యనూ నిరంతరం ప్రభావితం చేస్తున్న శక్తి అది. కుటుంబ సభ్యుల మధ్య పెనవేసుకుపోయిన భావోద్వేగ బంధాలు అనేకులకు కష్టాలను ఎదిరించి నిలిచేందుకు తమవుతున్నాయి. కుటుంబాన్ని కాపాడుకునే క్రమంలో అవసరమైతే ప్రాణాలు ఇచ్చేందుకైనా, తీసేందుకైనా వెనకాడనివాళ్లు చాలామందే ఉన్నారు. కానీ ఇటీవల కొన్ని దశాబ్దాలుగా సమాజంలో చోటుచేసుకొంటున్న పరిణామాలను గమనిస్తే మన కుటుంబ వ్యవస్థ భవిష్యత్తు గురించిన మూడు ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మొదటిది: కుటుంబాన్ని, సమాజాన్ని పరస్పరం విరుద్ధమైన రెండు భిన్న ధ్రువాలుగా అర్థం చేసుకునే పరిస్థితి మనముందుంది. ఎలాగంటే- కుటుంబంకోసం పనిచేయడమంటే దాని అర్థం సమాజ ప్రయోజనాలను గాలికి వదిలేసినట్లే. అదేవిధంగా ప్రజా సంక్షేమంకోసం కృషి చేయడమంటే కుటుంబం బాగోగులను పణంపెట్టినట్లేనన్న ధోరణి క్రమంగా బలపడుతోంది. కుటుంబం-సమాజం భావనల మధ్య బొత్తిగా సామరస్యం కుదరని ఈ వైఖరి కారణంగా... మన భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

రెండోది: తాతలు, తండ్రులు, కొడుకులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లు... ఇలా అంతా ఒకే కప్పు కింద నివసిస్తూ కలిగినదాన్ని సమానంగా పంచుకునే ఆనందమయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైంది. భార్య, భర్త, పిల్లలకు మాత్రమే పరిమితమైన చిన్న కుటుంబం చాలావరకు ఇప్పుడు సామాజిక వాస్తవం. పట్టణీకరణ, ఆధునికీకరణ మోసుకొచ్చిన మార్పు ఇది. పెరిగి పెద్దవుతున్న పిల్లలు క్రమంగా తల్లిదండ్రులనుంచి

దూరమై... వేరు కాపురాలు పెట్టుకుంటున్నారు. ముసలి తల్లిదండ్రులు రానురాను ఒంటరితనానికి దగ్గరవుతున్నారు. ఉమ్మడి వ్యవస్థనుంచి బయటపడి వేరు కుంపట్లు పెట్టుకుంటున్న ఇలాంటి కుటుంబాల మధ్య ప్రేమ, అభిమానాల స్థానే- పోటీ, ఆస్తుల పంపకంలో తగాదాలు వంటివి సహజంగా మారుతున్నాయి. మూడోది: ఆర్థిక వ్యవస్థ మారుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యుల మధ్య సంబంధాల్లో కొత్త కోణం ఆవిష్కృతమవుతోంది. వ్యవసాయ ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో డబ్బుపరంగా వ్యక్తుల జీవితాల్లో చెప్పుకోదగిన ఎత్తుపల్లాలు ఉండేవి కావు. కుటుంబ సభ్యుల మధ్య శత్రుత్వాలనేవి ఉన్నా- చుట్టరికాల్లోనే వివాహాలు చేసుకొనే నియమం ఉండటం వల్ల ఆ తగాదాలు పెద్దగా ముదరకుండానే సమసిపోయేవి. కానీ ఆధునిక ఆర్థిక వ్యవస్థ ఆగమనం ఫలితంగా కుటుంబ సభ్యుల మధ్య శత్రుత్వాలు కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. నూతన వ్యవస్థ తెచ్చిన తీవ్రమైన ఆర్థిక అంతరాల కారణంగా రక్త సంబంధీకుల మధ్య అసూయ, కోపం, ద్వేషం వంటివి కొత్తగా వచ్చి చేరాయి. కలవరం కలిగిస్తున్న సమస్యలివి. సమాజం, కుటుంబాల మధ్య సామరస్యం చెడిపోవడం; ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ముక్కలై రక్తసంబంధీకుల మధ్య అంతరాలు పెరగడం వంటి సమస్యలకు సామాజికవేత్తలు, మేధావులు పరిష్కారాలను సూచించాల్సి ఉంది. కుటుంబ సంబంధాలు మరీ పెళుసుగా మారుతున్న నేపథ్యంలో- సమాజానికి సత్తువను, స్థిరత్వాన్ని ప్రసాదించడంకోసం తగిన కృషి తప్పనిసరి. డబ్బుపట్ల మనం ఏర్పరచుకుంటున్న దృక్పథమెలాంటిదో చర్చించుకోవాల్సిన అవసరాన్ని ఈ విషాద సంఘటన గుర్తు చేస్తోంది. అన్ని దుఃఖాలకూ ధనమే మూల కారణమన్న మాటను మనం సంప్రదాయంగా వింటూనే ఉన్నాం. మనుషుల్లోని డబ్బు సంపాదించాలన్న తపన వారి మధ్య పోటీకి, వారి పురోభివృద్ధికి కారణమవుతుందని ఆర్థికవేత్తలు చెబుతుంటారు. జీవితంలో ఆనందాన్ని వెతికే క్రమంలో డబ్బు ఓ సాధనంగా ఉపయోగపడుతుందే కానీ, కేవలం డబ్బు మాత్రమే మనల్ని ఆనందపరచలేదని విజ్ఞులు అంటుంటారు. ధనం చాలా సందర్భాల్లో మనుషుల మధ్య అసంతృప్తి, అసహనం, శత్రుత్వాలు పెరగడానికి కారణమవుతుందన్న మాటలోనూ నిజముంది. డబ్బును సంపాదించే లక్ష్యంతో విలువలకు తిలోదకాలు ఇచ్చినట్లయితే- అది సమాజానికి, కుటుంబానికి మధ్య అగాధాన్ని మరింత పెంచుతుంది. నీతికి, న్యాయానికి కట్టుబడి, సేవ చేయడం ద్వారా సంపాదించే డబ్బు- సమాజానికి నిజమైన చోదక శక్తిగా ఉపయోగపడుతుంది. సమాజ పురోభివృద్ధికి అవసరమైన సంపద సృష్టికి ఉపయోగపడని ధనార్జన వ్యవస్థకు ప్రమాదం కలిగిస్తుంది. డబ్బు సంపాదించడమొక్కటే అంతిమ లక్ష్యమైతే అది మనలోని అభద్రత భావాన్ని పెంచడంతోపాటు, మనలను మరింత దురాశాపరులుగా మారుస్తుంది. మన దగ్గర ఉన్న వనరులెప్పటికీ మన ఆకాంక్షల్ని సంతృప్తిపరచలేవు. చివరికి బిల్‌గేట్స్ స్థాయి వ్యక్తి కూడా తాను సంపాదించింది... తన అవసరాలను పూర్తిగా తీర్చడం లేదనే భావిస్తాడు. వివేకవంతంగా డబ్బును వినియోగించినప్పుడే- ఉన్న వనరులకు, కోరికలకు మధ్య అగాధాన్ని తగ్గించడం సాధ్యమవుతుంది. సమాజ నిర్మాణానికి అవసరమైన పెట్టుబడుల రూపంలో డబ్బును ఉపయోగించినట్లయితే- ఉద్యోగావకాశాలు పెరిగి అందరికీ మంచి జరుగుతుంది. సామాజిక పెట్టుబడి రూపంలో... అంటే మంచి విద్య, ఆరోగ్య సదుపాయాలు, అందమైన పార్కులు, గ్రంథాలయాలు, పౌర సదుపాయాలకోసం డబ్బును ఉపయోగిస్తే సమాజానికి నేరుగా మేలు జరుగుతుంది. ఇదంతా సాధ్యం కావాలంటే- డబ్బే సర్వస్వం అనే దృక్పథం నుంచి బయటపడి, సేవా భావాన్ని అలవరచుకోవడం అవసరం. ఇలాంటి సవ్యమైన ఆలోచనలకు తిలోదకాలు వదిలితే మాత్రం- డబ్బన్నది విస్తృత ప్రజావసరాలను పణంగా పెట్టి సంపాదించుకోవాల్సిన వ్యక్తిగత అవసరంగానే మిగిలిపోతుంది. అలాంటి ఆలోచనలు- వ్యక్తికి, కుటుంబానికి, సమాజానికి తీవ్రమైన బాధను, దుఃఖాన్ని కలిగిస్తాయి.

### మారుతున్న అర్థాలు...

మహాజన్ మరణానికి దారితీసిన నేపథ్యం- ప్రజా ప్రాతినిధ్యాన్ని, రాజకీయాలను మనం అవగతం చేసుకుం టున్న తీరుపై పలు ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ఉత్తమ సమాజంలో- ప్రజాప్రాతినిధ్యం, రాజకీయాలనేవి వ్యక్తి గత ప్రయోజనాలను నెరవేర్చుకునే కేంద్రాలు కానే కావు. చరిత్రలో గొప్ప నాయకుడిగా పేరొందిన వారెవరూ తమ పదవులను ఉపయోగించుకుని వ్యక్తిగత అవసరాలు తీర్చుకున్న దాఖలాలు లేవు. వ్యక్తిగత లాభాలను పట్టించుకోకుండా అకుంఠిత దీక్షతో ప్రజల కోసం పనిచేసే వారిని సమాజం అదే స్థాయిలో గౌరవిస్తుంది, కాపాడుకుంటుంది. ఇలాంటి సమాజ సేవకులకు దక్కే ప్రయోజనాలు డబ్బు రూపంలో ఉండవు. కుటుంబం నుంచి, మిత్రులనుంచి ఆర్థికంగా అతనికి సాయం అందవచ్చుగాక. కానీ సమాజం నుంచి అందే గౌరవం మాత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. నిస్వార్థంగా సేవ చేయడం ద్వారా మెరుగైన సమాజాన్ని సాధించుకు న్నామన్న సంతృప్తే ఓ పెద్ద గౌరవం. ఇక ప్రజలందించే అమితమైన ప్రేమానురాగాలు వెలకట్టలేనివి.

గడచిన నలభై ఏళ్లుగా ప్రజా ప్రాతినిధ్యమంటే డబ్బు సంపాదించడానికి దగ్గరి మార్గమన్న భావనే భారతీయ సమాజంలో స్థిరపడిపోయింది. డబ్బు సంపాదించడం పాపం కాదు. కానీ ప్రజలను దోచుకొని, పదవులను దుర్వినియోగం చేసి ధనం కూడబెడితే మాత్రం అది మహాపాపం. రాజకీయ, ప్రభుత్వ, న్యాయ వ్యవస్థల్లో ఇప్పటికీ నీతి నిజాయతీలతో నిబద్ధంగా విధులు నిర్వహించే వారెందరో ఉన్నారు. కానీ సమాజంనుంచి అలాంటి వారి నిబద్ధతకు తగిన గుర్తింపు రానంతవరకూ... ప్రస్తుత పరిస్థితిలో మార్పు రాదు.

ప్రభుత్వ పదవిని ఓ వ్యాపారంగా, వ్యక్తిగత ఆస్తిగా భావించే ప్రమాదకర ధోరణి మన సమాజాన్ని పట్టి పీడి స్తోంది. అధికారంలోని వ్యక్తులు ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టయినా సరే తమకు మేలు చేయాలని వారి బంధుమిత్రులు ఆశిస్తూ ఉంటారు. అన్యాయంగానైనా డబ్బు సంపాదించి... అందులో తమకు వాటా ఇవ్వా లని తలపోస్తుంటారు. ఈ రకమైన ధోరణి మన ప్రజాస్వామ్య, రాజకీయాల పునాదుల్నే కదిలించి వేస్తోంది.

ప్రజల డబ్బును 1500 కోట్ల రూపాయల మేర వెనకేసుకున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్న చౌతాలా ఉదంతం ఇందుకు తాజా ఉదాహరణ. ఒక్క చౌతాలా మాత్రమే కాదు ఎందరో నేతలు అనైతిక మార్గాల్లో డబ్బును సంపాదించుకున్నారన్నది నిజం. దురదృష్టవశాత్తూ మన సమాజంలో ఇలాంటి నేతలను చూసి... మనకు ఆ రకమైన అవకాశాలు లేవే అని అసూయ పడే ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది కానీ, వారిని నిలదీ యాలన్న తపన మాత్రం బొత్తిగా కరవవుతోంది. ఈ ధోరణి వల్ల భవిష్యత్తులో మనం చాలా కోల్పోవాల్సి ఉంటుంది.

### దృక్పథం మారితేనే పురోగతి

అంతర్గతంగా మన సమాజం ఎంతో శక్తివంతమైనది. మనం శతాబ్దాలుగా నెలకొల్పుకొన్న నాగరికత సంప్ర దాయాల గొప్పతనం తోసిపుచ్చలేనిది. వాటిని మరోసారి మననం చేసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. కుటుంబానికి సమాజానికి మధ్య ఉన్న సామరస్య సంబంధాలను గుర్తించి... ఆ మేరకు మన దృక్పథాన్ని సంస్కరించుకోవడం తప్పనిసరి. డబ్బును ఓ ఉపయోగకరమైన సాధనంగా తప్ప... దాన్నే పరమ లక్ష్యంగా చూసే పరిస్థితిలో మార్పు రావాలి. అధికారానికి వ్యక్తిగత స్వార్థానికి లంకె కుదరదన్న వాస్తవాన్ని గుర్తెర గాలి. కొన్ని సందర్భాల్లో ఇలాంటి విషాద సంఘటనల వల్ల మన సమాజంలో నెలకొన్న అవాంఛనీయ ధోర ణులపై దృష్టి సారించే అవకాశం కలుగుతుంది. తప్పును గుర్తించి, దానిని సవరించుకునే దిశగా కలిసికట్టుగా కదిలితే- అభివృద్ధి చెందేందుకు సమాన అవకాశాలు ఉన్న ఆనందమయ సమాజం ఆవిష్కృతమవుతుంది.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)